అనంతపురం(రైల్వే), న్యూస్ టుడే: గుత్తి-బెంగళూరు రైలు మార్గంలో విద్యుత్తు రైళ్లు పరుగులు తీస్తున్నాయి. గత మూడు రోజులుగా సరుకు రవాణా రైళ్లకు విద్యుత్తు ఇంజిన్లను అతికించారు. ఎట్టకేలకు విద్యుత్తు ఇంజిన్లు అనంతలో కూతపెట్టాయి. గుత్తి నుంచి బెంగళూరుకు పుట్టపర్తి మీదుగా 280 కి.మీ., ధర్మవరం నుంచి నేరుగా పెనుకొండకు వెళ్లే మార్గంలో 234 కి.మీ. ఉంది. దక్షిణ పశ్చిమ రైల్వే బెంగళూరు డివిజన్ తొలి విద్యుత్తు ఇంజిన్ను గుత్తికి పంపారు. అనంతరం గుత్తి నుంచి దక్షిణ మధ్య రైల్వే విద్యుత్తు ఇంజిన్ను తిప్పి పంపారు. తొలి ఇంజిన్ పరుగులు విజయవంతం కావడం, భద్రతా కమిషన్ ఆమోదించడంతో విద్యుత్తు రైళ్లు నడపడానికి రెండు రైల్వే మండల అధికారులు అంగీకరించారు. దీంతో ప్రస్తుతం సరుకు రవాణా రైళ్లను విద్యుత్తు ఇంజిన్లతో నడుపుతున్నారు. బెంగళూరు నుంచి గుత్తి వరకు అన్ని రైల్వేస్టేషన్లలోని ప్లాట్ ఫారాలలోనూ ఇంజిన్లు సమర్థవంతంగా పరుగులు తీశాయి. అనంతపురం శివారు రైల్వే స్టేషన్ తాటిచెర్లలోని మూడవ ప్లాట్ ఫాంకు భద్రతా కమిషన్ అనుమతించాల్సివుంది. దీంతో ప్రస్తుతం తాటిచెర్ల మూడో ప్లాట్ ఫాంలో విద్యుత్తు రైళ్లను నడపటం లేదు. విద్యుత్తు ఇంజిన్లు పట్టాలెక్కడంతో ప్రయాణికుల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. నిత్యం అనంతపురం మీదుగా రోజూ నడిచే 28 రైళ్లతో పాటు మరో 12 వారాంతపు రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు మరో 20 సరుకు రవాణా రైళ్లను నడుపుతున్నారు. వెరసి రోజుకు పట్టాలపై 60 రైళ్లు పరుగులు తీస్తున్నాయి. సరుకు రవాణా రైళ్లను నడపటంలో విజయవంతమైతే ప్రయాణికుల రైళ్లకు విద్యుత్తు ఇంజిన్ల సహాయంతో నడపనున్నారు. విద్యుత్తు ఇంజిన్లతో రైలు ప్రయాణంలో వేగం పెరగడంతో పాటు కాలుష్యం పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుంది. దీనికితోడు రైల్వేశాఖకు ఇంధనం ఖర్చు భారీగా తగ్గనుంది.